www.prajasakti.com
ప్రజాశక్తి
గురువారం 25 డిసెంబర్ 2025

2వ డివిజన్‌లో కమిషనర్ పర్యటన

ప్రజాశక్తి - కడప అర్బన్ : కడప నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మనోజ్ రెడ్డి బుధవారం 2వ డివిజన్ పరిధిలోని వైఎస్ఆర్ కాలనీని సందర్శించారు. ఈ పర్యటనలో భాగంగా కమిషనర్ అక్కడి ప్రజలతో ప్రత్యక్షంగా మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. శానిటేషన్‌కు సంబంధించిన అంశాలపై ప్రత్యేక ద ృష్టి సారించి, రోజూ శుభ్రపరిచే పనులు సక్రమంగా జరుగుతున్నాయా, రోజూ క్లాప్ ఆటో ద్వారా చెత్త సేకరణ జరుగుతోందా అనే విషయాలపై ఆరాతీశారు. ప్రజలు తెలిపిన సమస్యలకు అనుకూలంగా స్పందిస్తూ, వాటిని త్వరితగతిన పరిష్కరించాలని సంబంధిత మునిసిపల్ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. అనంతరం 14వ డివిజన్ పరిధిలోని ఆర్ట్స్ కాలేజీ సమీపంలోని ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లో ఉన్న ఇస్కాన్ మిడ్‌డే మీల్ కిచెన్‌ను కమిషనర్ సందర్శించారు. అక్కడ పనిచేస్తున్న సిబ్బందితో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. వాటికి తగిన పరిష్కార చర్యలను త్వరలోనే కలెక్టర్‌కు తెలియజేస్తామని తెలిపారు.

కష్టాల్లో కమ్యూనిటీ హెల్త్

- తొలగని స్పెషలిస్టు వైద్యుల కొరత
- 233 మంది వైద్యులకు గానూ 163 మందే
- సామాన్య రోగుల దరిచేరని కమ్యూనిటీ హెల్త్ సేవలు

జిల్లాలోని కమ్యూనిటీ హెల్త్ హాస్పిటళ్లు సమస్యల వలయంలో చిక్కుకున్నాయి. జిల్లాలో పెరుగుతున్న రోగులకు అనుగుణంగా వైద్య సేవలు అందడం లేదనే విమర్శలు పెద్దఎత్తున ఉన్నాయి. ప్రభుత్వం ఏడాది కిందటి నుంచి జిల్లాల వారీగా వైద్య సేవలను అంచనా వేయడానికి ఉద్దేశించిన గ్రేడ్ల ఆధారిత వ్యవస్థను ఎత్తేసింది. ఎక్కువ సర్జరీలు, ఒపి, ఐపి సేవలు, దిగువ భాగాన ఫలానా జిల్లాలు ఉన్నాయనే పేరిట రివ్యూ చేయడం జరుగుతోంది. గ్రేడింగ్ సిస్టమ్ లేకపోవడంతో పోటీతత్వం కొరవడడంపై వైద్య ఆరోగ్య శాఖ అధికార వర్గాల్లో ఉత్సాహం కొరవడింది. ఫలితంగా ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా కమ్యూనిటీ హెల్త్ ఆస్పత్రుల పనితీరు మందగించింది. స్పెషలిస్టు, సాధారణ వైద్యుల కొరత నెలకొనడంతో వైద్య సేవల్లో మెరుగుదల కొరవడింది.

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

ఉమ్మడి జిల్లాలో కమ్యూనిటీ ఆస్పత్రుల్లో మెరుగైన వైద్యం కొరవడింది. ప్రొద్దుటూరు, జమ్మలమడుగు, బద్వేల్, వేంపల్లి, పోరుమామిళ్ల, మైదుకూరు, చెన్నూరు, కమలాపురం, సిద్ధవటం, రాజంపేట, రాయచోటి, లక్కిరెడ్డిపల్లి, రైల్వేకోడూరు ప్రాంతాల్లో డిసిహెచ్ఎస్ ఆస్పత్రులు ఉన్నాయి. కడప జిల్లా పరిధిలోని ఏడు డిసిహెచ్ఎస్ ఆస్పత్రుల్లో ప్రతినెలా సగటున రూ.1.13 లక్షల మంది ఒపి, 12 వేల మందికిపైగా ఐపి సేవలు పొందుతున్నారు. ఇటీవల రాష్ట్రప్రభుత్వం ఆస్పత్రుల పనితీరుకు సంబంధించిన గ్రేడి ంగ్ వ్యవస్థను ఎత్తే యడం, వైద్యుల నియామకాలపై దృష్టి సారించకపోవడం, టిఫాస్కాన్ వంటి ఆధునిక డయాగ్నోస్టిక్ వ్యవస్థలను ఏర్పాటు చేయకపోవడం, వైద్యుల్లో జవాబుదారీతనం కొరవడిందనే విమర్శలు ఉన్నాయి. మైదుకూరు, జమ్మలమడుగు ఆస్పత్రుల అప్‌గ్రేడేషన్‌కు స్థలాల కేటాయింపులకు అడ్డంకులు తలెత్తడం వంటి అనేక కారణాలతో సామాన్యులకు కమ్యూనిటీ హెల్త్ సేవలు అంతంతమాత్రంగానే కొనసాగుతున్నాయనే విమర్శలు ఉన్నాయి.

163 మందితోనే వైద్య సేవలు

ఉమ్మడి జిల్లాలోని 13 డిసిహెచ్ ఆస్పత్రులకు 233 మంది వైద్యులు సేవలు అందించాల్సి ఉంది. డిసిహెచ్ఎస్ వైద్య ఆరోగ్య శాఖ 163 మంది వైద్యులతోనే వైద్యసేవలు అందించడానికి తంటాలు పడుతోంది. కడప జిల్లాలోని పోరుమామిళ్ల, బద్వేల్, వేంపల్లి డిసిహెచ్ఎస్ ఆస్పత్రులు పూర్తిస్థాయిలో వైద్యసేవలు అందించిన దాఖలాల్లేవు. పోరుమామిళ్లలో 15 మంది వైద్యులు ఉండాల్సి ఉండగా ఎన్నడూ ఆరు నుంచి తొమ్మిది మంది వైద్యులను భర్తీ చేసిన దాఖలాల్లేవు. ఆస్పత్రికి పోరుమామిళ్ల, కలసపాడు, కాశినాయన, బి.కోడూరు మండలాల నుంచి వందలాది మంది సామాన్య రోగులు పెద్దఎత్తున ఒపి, ఐపి సేవలకు వస్తుంటారు. గైనకాలజీ, పీడియాట్రిక్స్, ఆర్థో తదితర విభాగాలకు చెందిన స్పెషలిస్టు వైద్యులు కొరవడిన ఫలితంగా రోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. చేసేదేమీ లేకపోవడంతో కడప, తిరుపతి, నెల్లూరు తదితర ప్రాంతాలకు రోగులు పరుగులు పెడుతున్నారు.

మంత్రి సొంత జిల్లాలో అవస్థలు

రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖా మంత్రి సొంత జిల్లాలోని సామాన్య రోగులకు అవస్థలు తప్పడం లేదు. వైద్యుల కొరత మొదలుకుని మైదుకూరు, జమ్మలమడుగు డిసిహెచ్ ఆస్పత్రుల అప్‌గ్రేడేషన్‌కు స్థలాల కొరత ఏర్పడడం, స్థలాల సమస్య పరిష్కారానికి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఇచ్చిన హామీ అమలుపై దృష్టి సారించాలనే వాదన వినిపిస్తోంది. ఇటువంటి అడ్డంకులను పరిష్కరించడం మరిచి, ఎంతసేపూ పిపిపి పేరిట మెడికల్ కళాశాలల అమ్మకం పట్ల ఉన్న శ్రద్ధ సొంత జిల్లా ఆరోగ్య పరిస్థితులపై లేదనే విమర్శలు ఉన్నాయి. తాజాగా రాష్ట్రంలోని ఏడు జిల్లాలకు టిఫాస్కాన్ యంత్రాల మంజూరు నేపథ్యంలో ఏపారామీటర్ ప్రకారం కేటాయింపులు చేసి నప్పటికీ మంత్రి సొంత జిల్లాకు కేటాయింపులు ప్రస్తావన లేకపోవడం ఏమిటనే అంశం ప్రస్తావనకు వస్తోంది. ప్రభుత్వం స్పందించి కమ్యూనిటీ హెల్త్ ఆస్పత్రుల అప్‌గ్రేడేషన్, వైద్య నిపుణుల నియామకం, స్థలాల సమస్య పరిష్కారం, ఆస్పత్రుల మానిటరింగ్ వంటి అంశాలపై స్పష్టమైన వైఖరితో ముందుకెళ్లాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

వైద్య నియామకాలపై దృష్టి పెట్టాం

ఉమ్మడి కడప జిల్లాలోని డిసిహెచ్ ఆస్పత్రుల వైద్యుల కొరతను భర్తీ చేయడంపై దృష్టి సారించాం. గత వారంలో 10 మంది స్పెషలిస్టు వైద్యులను నియమించాం. భవిష్యత్‌లో మిగిలిన పోస్టులను భర్తీ చేస్తాం.

- డాక్టర్ వై.హిమదేవి, డిసిహెచ్ఎస్ కో-ఆర్డినేటర్, కడప.

శిశువు గురించి స్థానికులతో ఆరా తీస్తున్న ఎస్ఐ శ్రీనివాసులరెడ్డి

రైతులు, కూలీల వేషధారణలో విద్యార్థులు

మానవత్వం మంట కలిసిన వేళ..

- కంపచెట్లలో అప్పడే పుట్టిన ఆడ శిశువు

ప్రజాశక్తి- చింతకొమ్మదిన్నె

మానవత్వం మంట కలిసిన వేళ, ఒక నిండు ప్రాణాన్ని తీసిన ఘటన స్థానిక మండల పరిధిలోని జె నారాయణపురం గ్రామంలో చోటు చేసుకుంది. స్థానిక ఎస్ఐ శ్రీనివాసుల రెడ్డి వివరాల మేరకు బుధవారం ఉదయం దాదాపు 11:30 గంటల సమయంలో జె. కొత్తపల్లి పోయే దారి పక్కన అంగన్వాడీ కేంద్రం ఎదురుగా కంపచెట్లలో అప్పుడే పుట్టిన ఆడ శిశువు రక్తపు మాంసపు ముద్దతో ఒక గుడ్డలో మూటగట్టి, ప్లాస్టిక్ కవర్‌లో ఉంచి రోడ్డు పక్కన పడవేశారు. అప్పటికే శిశువు చనిపోయిందని, సదరు శిశువు బొడ్డుతాడుతో ఉందని స్థానికులు గుర్తించి సమాచారం విఆర్ఒ చైతన్య యువరాజుకు అందించారు. ఆయన పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో ఎస్ఐ సంఘటనా స్థలానికి చేరుకుని ఆ మూటను విప్పి చూడగా ఆడ శిశువు ఉండడం చూసి నిర్ఘాంతపోయారు. ఈ విషయంపై దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

ఆంధ్ర, సౌరాష్ట్ర మ్యాచ్ ప్రారంభం

ప్రజాశక్తి - కడప

124 పరుగులు చేసిన వాన్స్ ఆచార్య

కడపలోని వైయస్ రాజారెడ్డి ఎసిఎ స్టేడియంలో బుధవారం కూచ్ బెహార్ ట్రోఫీ బిసిసిఐ అండర్ -19 స్టేట్ మ్యాచ్ ప్రారంభమైంది. టాస్ గెలిచిన ఆంధ్ర జట్టు ఫీల్డింగ్ ఎంచుకుంది. తొలుత బ్యాటింగ్ చేసిన సౌరాష్ట్ర జట్టు మొదటి ఇన్నింగ్స్‌లో 66.2 ఓవర్లలో 286 పరుగులకు అన్ని వికెట్లు కోల్పోయింది. ఆ జట్టులోని వాన్స్ ఆచార్య అద్భుతంగా బ్యాటింగ్ ప్రదర్శించి 124 పరుగులు (సెంచరీ) చేశాడు. హర్వాన్స్ సింగ్ 27 పరుగులు చేశాడు. ఆంధ్ర జట్టులోని తోషిత్ యాదవ్ 3, ప్రణవ్ రెడ్డి 2, రాజేష్ 2 వికెట్లు తీసుకున్నారు. అనంతరం బ్యాటింగ్ ప్రారంభించిన ఆంధ్ర జట్టు ఆట ముగిసే సమయానికి మొదటి ఇన్నింగ్స్ లో 17.0 ఓవర్లలో ఒక వికెట్ నష్టానికి 42 పరుగులు చేసింది.

మహిళలు చట్టాలపై అవగాహన పెంచుకోవాలి

ప్రజాశక్తి- చింతకొమ్మదిన్నె

మహిళలు చట్టాలపై అవగాహన పెంచుకోవాలని కోరారు ఎస్ఐ శ్రీనివాసుల రెడ్డి పేర్కొన్నారు. .బుధవారం భారత్ ఇంజినీరింగ్ కళాశాలలో 'మహిళల రక్షణ మన భాధ్యత – రక్షణ పొందడం వారి హక్కు' అనే అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమనికి ఎస్ఐ ముఖ్యఅతిథిగా హాజర య్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళల పట్ల జరుగుతున్న సంఘటనల పట్ల ఎలా అప్రమత్తంగా ఉండాలి, సోషియల్ మీడియాలో జరుగుతున్న మోసాలు, సైబర్ క్రైమ్ నేరాల గురించి వివరిస్తూ వాటి వలలో పడి మోసపోయి మీ జీవితాన్ని పాడు చేసుకోవద్దని తెలియజేశారు.మీరు బాగా చదివి మంచి ఉద్యోగాలు సాధించి తల్లిదండ్రులకు మంచి పేరు తేవాలని సూచించారు.మహిళల రక్షణ కోసం ఎల్లప్పుడు పోలీస్ శాఖ ఉంటుందని గుర్తు చేశారు. కార్యక్రమంలో కళాశాల ఎఒ అయ్యవారు, కళాశాల అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు.

ఇంటర్‌నేషనల్ ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌లో రైతు దినోత్సవ వేడుకలు

ప్రజాశక్తి - కడప అర్బన్

ఇంటర్నేషనల్ ఢిల్లీ పబ్లిక్ స్కూల్ విద్యార్థులు రైతు దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఎల్‌కెజి నుంచి సెకండ్ క్లాస్ చదువుతున్న విద్యార్థులను పొలాల్లోకి తీసుకెళ్లి రైతు ఎలా వ్యవసాయం చేస్తున్నారు అనే విషయాన్ని స్వయంగా పరిశీలించే ట్రిప్ నిర్వహించారు. ఈ సందర్భంగా డైరెక్టర్ ఎం. వివేకానంద రెడ్డి మాట్లాడుతూ సామాజిక వ్యవస్థలో విద్యార్థుల్లో నైతిక విలువలు పెరగడానికి రకరకాల ప్రయోగాలు చేయాల్సి వస్తుందని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాలలోని పొలాలలో ఉన్న మట్టిని తొక్కుతూ, నారు నాటుతూ, ఎద్దులను తోలుకుంటూ, భూమిని ఏవిధంగా కాపాడుకోవాలి, ఎంత కష్టపడితే రైతుకు పంట చేతికి వస్తుంది అనే విషయాన్ని తెలిసేలా చేశామని తెలిపారు. రైతుల కష్టాన్ని విద్యార్థులు గుర్తించారా లేదా అన్న ఒక అంశాన్ని తీసుకుని పల్లెకు వెళ్లినట్లు చెప్పారు. ఇప్పటికీ రైతులకు గిట్టుబాటు ధర లేక బాధల్లో ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వీరిది ఏ విధంగా రక్షిస్తారు, ఎలా చూసుకోవాలి అనే అంశాలపై చర్చించామని పేర్కొన్నారు. రైతు కష్టాలను విద్యార్థులు అర్థం చేసుకున్నారని తెలిపారు. జంక్ ఫుడ్స్, హాస్టల్స్, హోటల్స్‌లో రకరకాల తిండి తింటూ ఉన్నారని చెప్పారు. రైతు పడే కష్టం ప్రతి విద్యార్థి తెలుసుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో ఇన్‌ఛార్జి సంధ్యా, ఉపాధ్యాయులు విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పోలీసుస్టేషన్‌లో డిఎస్‌పి ఆకస్మిక తనిఖీ

ప్రజాశక్తి - కలసపాడు

స్థానిక పోలీస్ స్టేషన్ మైదుకూరు డిఎస్‌పి రాజేంద్రప్రసాద్ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు, ఈ సందర్భంగా పలు రికార్డులను పరిశీలించారు. అనంతరం శక్తి యాప్ వల్ల ఉపయోగాలను ప్రజలలోకి తీసుకు వెళ్లాలని, స్టేషన్‌కు వచ్చిన ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలని ఆయన సిబ్బందికి సూచించారు. రాత్రిపూట గస్తీ ముమ్మరం చేయాలని ఆదేశించారు. ఎవరైనా ఎలాంటి అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే ఉపేక్షించేది లేదన్నారు మహిళల భద్రత గురించి మహిళా వాలంటీర్లకు గ్రామాల్లో తెలియజేయాలని పేర్కొన్నారు. 112 గురించి గ్రామాల్లో అవగాహన కల్పించాలని చెప్పార. స్టేషన్‌లో సిబ్బంది కొరత ఉన్నందున ఉన్నతాధి కారులకు తెలియపరచి కొత్త నియమిస్తామని చెప్పారు. మండలంలో సిసి కెమెరాలు దాతల సహాయంతో ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో పోరుమామిళ్ల సిఐ హేమ సుందర్ రావు, ఎస్ఐ సుభాన్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు

రికార్డులు పరిశీలిస్తున్న మైదుకూరు డిఎస్‌పి

రాష్ట్ర స్థాయి 'చెకుముకి'లో విద్యార్థుల సత్తా

- ప్రశంసించిన డిఇఒ షంషుద్దీన్

విజేతలతో డిఇఒ, జెవివి నాయకులు

ప్రజాశక్తి - కడప అర్బన్

చెకుముకి రాష్ట్రస్థాయి సైన్స్ సంబరాలు కడప శ్రీ సాయి విజ్ఞాన్ ఇంగ్లీష్ మీడియం పాఠశాల విద్యార్థులు హర్షిత్ సాయి, రిషిత రామ్, చరణ్ విశేష ప్రతిభ కనబరిచి రెండవ స్థానం సాధించడం పట్ల డిఇఒ షంషుద్దీన్ హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన అభినందన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చిన్న వయస్సులోనే శాస్త్రీయ ఆలోచనతో ప్రశ్నించే దృక్పథాన్ని ప్రదర్శించడం అభినందనీయమని తెలిపారు. రాష్ట్రస్థాయిలో విజయాన్ని సాధించడం పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు, విద్యార్థుల నిరంతర కృషికి ప్రతిబింబమని పేర్కొన్నారు. విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించే లక్ష్యంతో కార్యక్రమాలు నిర్వహిస్తున్న జన విజ్ఞాన వేదిక సేవలను ఆయన ప్రత్యేకంగా ప్రశంసించారు. కరస్పాండెంట్ మైథిలి మాట్లాడుతూ విద్యార్థులు పాఠశాల పేరును రాష్ట్ర స్థాయిలో నిలపడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. జన విజ్ఞాన వేదిక పిల్లలకు ఉపయోగపడే ఇలాంటి కార్యక్రమాల్ని చేయడం అభినందనీయమని పేర్కొన్నారు. ఇది తమ పిల్లలకు ఎంతగానో ఉపయోగపడిందని తెలిపారు. జన విజ్ఞాన వేదిక రాష్ట్ర కార్యదర్శి శివరాం కృష్ణారెడ్డి మాట్లాడుతూ చెకుముకి సైన్స్ సంబరాలలో రాష్ట్రవ్యాప్తంగా నాలుగు లక్షలకు పైగా విద్యార్థులు రాయగా అందులో జిల్లా స్థాయిలో విజేతలుగా నిలిచినటువంటి టీములని కాకినాడ జెఎన్‌టియు యూనివర్సిటీలో మూడు రోజులపాటు నిర్వహించినట్లు పేర్కొన్నారు. విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథం, సామాజిక అవగాహన, తార్కిక ఆలోచనలను పెంపొందించే రాష్ట్రస్థాయి వేదికగా రూపుదిద్దుకున్నాయని తెలిపారు. రాష్ట్రస్థాయిలో రెండవ స్థానం సాధించడం కడప జిల్లాకు గర్వకారణమని పేర్కొంటూ, విద్యార్థులు భవిష్యత్తులో జాతీయ స్థాయిలో కూడా సత్తా చాటాలని ఆకాంక్షించారు. విజయానికి కారణమైన పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులకు అభినందనలు తెలిపారు. తల్లిదండ్రులు ఇందిరా, ఆనంద్ కుమార్ మాట్లాడుతూ ఈ విజయం జిల్లాలోని విద్యార్థులకు ప్రేరణగా నిలిచి, శాస్త్ర విజ్ఞాన రంగంలో మరింత ముందుకు సాగేందుకు దోహదపడుతుందని పలువురు అభిప్రాయపడ్డారు.

చట్టాలు, హక్కులపై వినియోగదారులకు

అవగాహన అవసరం : డిఆర్ఒ

విజేతకు ప్రశంసా పత్రం అందజేస్తున్న డిఆర్ఒ

ప్రజాశక్తి - కడప

వినియోగదారులు చట్టాలపై అవగాహన పెంచుకొని అమ్మకాలలో చోటు చేసుకుంటున్న మోసాలను అరికట్టాలని డిఆర్ఒ విశ్వేశ్వరనాయుడు పిలుపునిచ్చారు. బుధవారం సాయంత్రం కడప నగరంలోని గాంధీనగర్ నగర ఉన్నత పాఠశాల ప్రాంగణంలో జాతీయ వినియోగదారుల దినోత్సవం–2025 జిల్లాస్థాయి వేడుకల్లో భాగంగా జిల్లా వినియోగదారుల వ్యవహారాలు, ఆహార పౌరసరఫరాల శాఖల సంయుక్త ఆధ్వర్యంలో 'డిజిటల్ న్యాయ పాలన ద్వారా సమర్థ, సత్వర పరిష్కారం' అనే అంశంపై నిర్వహించిన సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా డిఆర్ఒ మాట్లాడుతూ వినియోగదారులు ఎంతో కష్టపడి కొన్న వస్తువు నాణ్యత లోపిస్తే వారు ఎంత మనస్తాపానికి గురవుతారో గ్రహించి ఆ ధోరణిలో మోసాలు జరగకుండా చర్యలు చేపట్టాలన్నారు. దైనందిన జీవితంలో ఉపయోగించే ప్రతి ఒక్క వస్తువుపెనా వినియోగదారుడికి చట్టపరమైన హక్కును ప్రభుత్వం కల్పించిందన్నారు. 1986లో రూపు దిద్దుకున్న వినియోగదారుల చట్టాన్ని కేంద్ర ప్రభుత్వం మరింత సమర్థవంతంగా వినియోగదారుల రక్షణ చట్టం – 2019'గా.. మార్పు చేశారన్నారు. ఈ మార్పు చెందిన చట్టం–2020 సంవత్సర ఆరంభం నుంచి అన్ని రాష్ట్రాల్లో అమలులోకి వచ్చిందన్నారు. వినియోగదారులు తమ హక్కుల పట్ల ఎప్పటికప్పుడూ అవగాహన పెంచుకోవాలని డిఆర్ఒ సూచించారు. జిల్లా వినియోగదారుల కమిషన్ చైర్మన్ జి.ఎం. బి. మురళీక ృష్ణ మాట్లాడుతూ ప్రస్తుతం జిల్లా కోర్టుకంటే వినియె ాగదారుల చట్టం ముందు ఎన్నో ఫిర్యాదులు వస్తున్నాయంటే వినియోగదారుల అవసరాలు ఏ స్థాయిలో ఉన్నాయో తెలుస్తోందన్నారు. వినియోగదారుల సౌలభ్యం, సమయాన్ని పరిగణలోకి తీసుకుని ప్రభుత్వం వర్చువల్ విధానంలో విచారణ, అలాగే డిజిటల్ పద్దతిలో సులభతరంగా ఫోరంకు నేరుగా ఫిర్యాదు చేసే సదుపాయాన్ని కల్పించనుందన్నారు. ఆహార కల్తీ నిరోధక శాఖ జిల్లా ఇంచార్జి అధికారి రామచంద్ర మాట్లాడుతూ దైనందిన జీవితంలో ప్రతి ఒక్కరూ వ్యాపారి వద్ద ఏదో ఒక వస్తువు కొనాల్సిన అవసరం ఉంటుందని, మనం కొనే వస్తువు యొక్క స్థితిని గమనించడం మన బాధ్యత అన్నారు. వస్తువు తయారీ తేదీ, గడువు ముగింపు తేదీ, వస్తువు నాణ్యత ప్రమాణాలు, రుచి, వాసన తదితర వస్తువు స్థితిని గమనించాలని తెలిపారు. ఏమైనా తేడాలు గమనించినట్లయితే వెంటనే వినియోగదారుల ఫోరంలో ఫిర్యాదు చేయవచ్చని చెప్పారు. పౌరసరఫరాల శాఖ జిల్లా అధికారి రఘురామ్ మాట్లాడుతూ ప్రస్తుతం వర్తక వ్యాపారాల్లో వినియోగ దారుడు చాలా విధాలుగా నష్టపోతున్నామని ఉన్నారు. జిల్లా పరిశ్రమల శాఖ జి.ఎం. చాంద్ బాషా మాట్లాడుతూ కొన్న ప్రతి వస్తువు పైన లేబుల్ డిస్‌ప్లే ఉందా లేదా అని చూసుకుని కొనాలని చెప్పారు. అనంతరం నిర్వహించిన పోటీల్లో విజేతలకు ప్రశంసా పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో వినియోగదారుల సమాచార కేంద్రం కన్వీనర్ కమ్ అడ్వైజర్ పి.రమేష్, జిల్లా ఫుడ్ ఇన్‌స్పెక్టర్ హరిత, పాఠశాల ఉపాధ్యాయులు, ఔషధ నియంత్రణ శాఖ, ఎపి వినియోగదారుల ఫోరం జిల్లా సభ్యులు, బార్ అసోసియేషన్ సభ్యులు, విద్యార్థులు హాజరయ్యారు.

అధిక ఒపి ఛార్జీలను అరికట్టాలి : డివైఎఫ్ఐ

ప్రజాశక్తి - కడప అర్బన్

జిల్లాలో నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న ప్రయివేట్ ఆసుపత్రులపై చర్యలు తీసుకోవాలని, ప్రజల వద్ద నుంచి అధిక మొత్తంలో ఒపి ఫీజును అరికట్టాలని డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ముడియం చిన్ని, వీరనాల శివకుమార్ తెలిపారు. బుధవారం జిల్లా కార్యాలయంలో విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సామాన్యులు రోగాలు నయం చేసుకోవడానికి ఆసుపత్రులకు వస్తే ఒపి టికెట్ ధర అధికంగా వసూలు చేయడంతోపాటు జనాలను వివిధ రకాల టెస్టులతో అధిక ఫీజులు వసూలు చేస్తున్నారని చెప్పారు. ఫీజు లు రూ.400,రూ.600 వరకు ఛార్జ్ చేస్తున్నారని పేర్కొన్నారు. గత్యంతరం లేక ఆసుపత్రులకు వస్తే ఇంత ఫీజులా అని సామానులు ప్రశ్నిస్తున్నారని తెలిపారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులు ఈ స్థాయిలో ప్రయివేటు ఆసుపత్రులు నిలువు దోపిడీ చేస్తుంటే ఏమి చేస్తున్నారని ప్రశ్నించారు. ఆసుపత్రి లోని మందులు షాప్ ఫార్మాసిస్టులు ఉండరని, డయాగ్నస్టిక్ సెంటర్‌లతో మాట్లాడుకుని అధిక మొత్తంలో టెస్టులు రాస్తున్నారని తెలిపారు. అధికారులు ఇప్పటికైనా స్పందించి అధిక ఫీజులు వసూలు చేస్తున్న ఆసుపత్రులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న వాటిపై కఠిన చర్యలు తీసుకోవాలని, లేకుంటే డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో ఆందోళన చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యుడు విశ్వనాథ్, నగర కార్యదర్శి విజయ్ పాల్గొన్నారు.

కామర్స్ విద్యార్థులకు ప్రశంసలు

ప్రజాశక్తి - కడప అర్బన్

ప్రొద్దుటూరులోని వైఎస్ఆర్ వైవీయు ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహించిన అంతర్ కళాశాలల క్రీడా పోటీల్లో యోగి వేమన విశ్వవిద్యాలయం కామర్స్ విద్యార్థులు (క్రీడాకారులు) రాణించడం పట్ల శాఖ విభాగాధిపతి ఆచార్య ఎస్.రఘునాథ రెడ్డి అభినందించారు. ఖోఖో, వాలీబాల్ ఆటల్లో తృతీయ స్థానంలో నిలిచినందుకు ప్రశంసిస్తూ మరింత క్రీడా స్ఫూర్తితో సాధన చేయాలన్నారు. ఖోఖో జట్టులో దత్తేశ్వరయ్య స్వరూప, మౌనిక, లయశ్రీ, శృతి , వాలీబాల్ జట్టులో గౌతమి, లహరి, మణిదీప్, నాని కుమార్ ఉన్నారు. ఈ సందర్భంగా ఆచార్య విజయభారతి క్రీడాకారులను ప్రశంసించారు. కార్యక్రమంలో అధ్యాపకులు డాక్టర్ రఫీ, డాక్టర్ రజిని, డాక్టర్ నిరోషా, సిబ్బంది చెన్నారెడ్డి ఆదినారాయణ రెడ్డి పాల్గొన్నారు.

సచివాలయ సిబ్బందికి శిక్షణ తరగతులు

ప్రజాశక్తి - గోపవరం

స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం మండల పరిధిలోని గ్రామ సచివాలయ కార్యదర్శులు, డిజిటల్ సహాయకులకు శిక్షణ తరగతులు నిర్వహించారు. కార్యక్రమాన్ని ఎంపిడిఒ సురేష్ బాబు, డిప్యూటీ ఎంపిడిఒ హసీనా ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ సచివాలయ కార్యదర్శులు, టైపిస్టులకు టిఒటి ట్రైనింగ్ ఆఫ్ ట్రైనర్స్‌గా ఎం. వెంకటనారాయణ శిక్షణను అందించారు. ప్రభుత్వ పథకాల అమలులో డిజిటల్ సేవల వినియోగం, విధి నిర్వహణలో పాటించాల్సిన నిబంధనలు, ప్రజలకు మెరుగైన సేవల అందింపుపై శిక్షణలో వివరించారు.

మాట్లాడుతున్న ఎంపిడిఒ

నిజం బయటపడక తప్పదు

ప్రజాశక్తి - కడప

మాట్లాడుతున్న నాగార్జునరెడ్డి

అబద్దానికి ఆయువు తక్కువ... నిజం ఎప్పటికైనా బయట పడక తప్పదని వైసిపి డాక్టర్స్ వింగ్ జిల్లా అధ్యక్షులు డాక్టర్ ఎన్. నాగార్జునరెడ్డి అన్నారు. బుధవారం వైసిపి కడప జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ఎన్నికలకు ముందు అరాచకం, విధ్వంసం, వినాశనం, ఆర్థిక సంక్షోభం, కల్తీ మద్యం అని గ్లోబల్ ప్రచారం చేసి ప్రజలను గందరగోళంలోకి నెట్టారన్నారు. దీంతో ఎన్నికల ఫలితాలు తారుమారు అయ్యాయని చెప్పారు. అరాచకం, విధ్వంసం, వినాశనం, ఆర్థిక సంక్షోభం, కల్తీ మద్యం అన్నవి జరిగాయంటే ఏమీ జరగలేదని ఇప్పుడు నిజాలు ఒక్కొక్కటి నివేదికల ద్వారా బయటపడుతున్నాయన్నారు. జిఎస్‌డిపి 2019 వరకు 12.9 శాతం ఉంటే 2019 –23లో రెట్టింపై 23 శాతం పెరిగి దేశంలోనే మన రాష్ట్రం ను ప్రథమ స్థానంలోకి తీసుకొచ్చారని చెప్పారు. జిఎస్‌డిపి రెట్టింపు అయితే మరి ఎలా ఆర్థిక సంక్షోభం ఏర్పడుతుందని అన్నారు. అప్పుల విషయానికి వస్తే కొత్తగా రాష్ట్ర ఏర్పడినప్పుడు రూ. 1. 40 వేల కోట్లు అప్పు ఉండేదన్నారు. 2014- 19 నాటికి రూ. 2 .20 వేల కోట్ల కు చేరిందన్నారు. జగన్ ప్రభుత్వంలో కల్తీ మద్యంతో ప్రజలు చచ్చిపోతున్నారని చెప్పారు. నివేదికల ప్రకారం చూస్తే ఒక్క మరణం కూడా జరగలేదని తేలింది అన్నారు. పరిశ్రమలకు సంబంధించి ఆర్‌బిఐ నివేదిక ప్రకారం 2019- 24లో భారతదేశంలో వృద్ధిరేటు సగటున 6.87 శాతం ఉంటే ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 11.12 శాతానికి పెరిగి దేశంలో ఐదవ స్థానంలో, దక్షిణ భారతదేశంలో ఒకటవ స్థానంలో రాష్ట్రం నిలిచిందన్నారు. జగన్మోహన్‌రెడ్డి క్రేజ్‌ను తగ్గించాలని ఇవన్నీ చేస్తున్నారన్నారు. నిజం ఎప్పటికీ రాజ్యం ఏలుతుందని ఆయన అన్నారు.

రైతే దేశానికి వెన్నెముక

ప్రజాశక్తి - కడప అర్బన్

రైతు దినోత్సవం సందర్భంగా కెఎల్ఎం మహిళా ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థినులు పెండ్లిమర్రి చిన్నదాసరి పల్లె రైతులను కలుసుకున్నారు. వారి నుంచి వ్యవసాయం గురించిన వివరాలను, వ్యవసాయంలో వారు ఎదుర్కొంటున్న సవాళ్లను, సమస్యలను గురించి తెలుసుకున్నారు. విద్యార్థినులు పొలంలో కలియ తిరిగారు. రైతులకు పురుగు మందులు తగ్గించి వాడమని సూచించారు. కృత్రిమ మేధతో వ్యవసాయంలో మెళుకువలను సూచించారు. ఎక్కువ క్రిమి సంహారక మందులను వాడటంలో జరిగే అనర్థాలను తెలియచేశారు. ఆధునిక పద్ధతుల ద్వారా ఎలా దిగుబడి సాధించవచ్చో తెలుసుకున్నారు. రైతు దేశానికి వెన్నెముక అని, మనకు తిండి పెట్టే వాడని అని కొనియాడారు. ప్రభుత్వాలు రైతులను ఆదుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని తెలిపారు. కార్యక్రమం ఎఐఎంఎల్ విభాగాధిపతి మహేష్ నాయక్,శ్వేత, జె.యోనాథన్ పాల్గొన్నారు. కళాశాల యాజమాన్యం అందరినీ అభినందించారు.

రైతు పొలాలలో కెఎల్ఎం ఇంజినీరింగ్ విద్యార్థినులు

భవన నిర్మాణానికి రూ.25 వేలు వితరణ

ప్రజాశక్తి - వేంపల్లె

నగదు అందజేస్తున్న కరస్పాండెంట్ రామాంజనేయరెడ్డి

పులివెందులలో నిర్మిస్తున్న స్నేహిత అమృత హస్తం సేవా సమితి భవనానికి స్వామి వివేకానంద పాఠశాల తరుపున రూ.25వేలు పాఠశాల కరస్పాండెంట్ వంగా సుబ్బు రామాంజనేయరెడ్డి అందజేశారు. ఆ సమితి అధ్యక్షులు మెమ్మెల్ల రాజుకు రామాంజనేయరెడ్డి బుధవారం అందజేశారు. శ్రీ చైతన్య పాఠశాల కరెస్పాండెంట్ చక్రపాణిరెడ్డి రూ.10 వేలు, మాజీ జడ్జీటీసీ సభ్యుడు డాక్టర్ ఎస్.ఎఫ్ బాషా రూ.5 వేలు, వీణా ఫ్రూట్ స్టోర్ యజమాని పుల్లగూర అరవింద్ రూ.5వేలు విరాళం అందజేసినట్లు రాజు తెలిపారు. భవన నిర్మాణంలో భాగస్వాములైన దాతలకు రాజు కృతజ్ఞతలు తెలిపారు.

మురళి భార్యకు నగదు అందజేస్తున్న నరసింహారెడ్డి

మేస్త్రీ కుటుంబానికి రూ.10 వేలు ఆర్థిక సాయం

ప్రజాశక్తి - వేంపల్లె

వేంపల్లెలోని వడ్డెర వీధికి చెందిన మేస్త్రీ సాతర్ల మురళి కుటుంబానికి ఎస్ఎస్ఆర్ కల్యాణమండపం యాజమాని సింగారెడ్డి నరసింహారెడ్డి రూ.10వేలు ఆర్థికసాయం చేశారు. స్థానిక వడ్డెర వీధికి చెందిన సాతర్ల మురళి అనే మేస్త్రీ రెండు కిడ్నీలు పాడై ఇటీవల మృతి చెందాడు. కార్యక్రమంలో శ్రీకృష్ణ ఆలయ చైర్మన్ దేరంగుల రామాంజనేయులు పాల్గొన్నారు.

మారుతి నగర్‌లో పైపులైన్ లీక్‌తో వృథాగా పోతున్న తాగునీరు

పైపులైన్ పగిలి.. వృథాగా పోతున్న నీరు

ప్రజాశక్తి - వేంపల్లె

ఇడుపులపాయ పంచాయతీ పరిధి మారుతీనగర్‌లో పైపులైన్ లీక్ కావడంతో తాగునీరు వృథాగా పోతోంది. లీక్ అవుతున్న తాగునీటి పైపులైన్లను మరమ్మతులు చేపట్టకపోవడంతో ప్రజలకు సక్రమంగా తాగునీరు అందడం లేదని జనసేన నేత పోతిరెడ్డి చలపతి తెలిపారు. పంచాయతీ అధికారులు కూడా చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారని పేర్కొన్నారు. 10 రోజులుగా తాగునీటి పైపులైన్ పగిలిపోయినా మరమ్మతులు చేపట్టక పోవడంతో మారుతి నగర్ ప్రజలకు తాగునీటి కష్టాలు మొదలయ్యాయని తెలిపారు. సమస్యను పంచాయతీ అధికారులు, సర్పంచ్ దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని వాపోతున్నారని తెలిపారు. పంచాయతీ అధికారులు తక్షణం స్పందించి పైపులైన్లు లీకేజీలను అరికట్టాలని చలపతి కోరారు.

ఆన్‌లైన్ మోసాల పట్ల అవగాహన అవసరం

- డిఆర్‌ఒ మధుసూదన్‌రావు

ప్రజాశక్తి - రాయచోటి

వినియోగదారులకు మెరుగైన సేవలు అందించేలా అధికారులు నిరంతరం చర్యలు చేపట్టాలని జిల్లా రెవెన్యూ అధికారి మధుసూదన్‌రావు పేర్కొన్నారు. బుధవారం ఉదయం రాయచోటి పైడిలో జిల్లా పౌరసరఫరాల శాఖ ఆధ్వర్యంలో జాతీయ వినియోగదారుల దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వినియోగదారుల హక్కులను పరిరక్షించడం, తప్పుదోవ పట్టించే ప్రకటనలు, లోపభూయిష్ట ఉత్పత్తుల నుంచి రక్షణ కల్పించడం, ఫిర్యాదులకు సత్వర పరిష్కారం అందించడం వినియోగదారుల సంరక్షణ చట్టం ముఖ్య ఉద్దేశమని తెలిపారు. ఈ ఏడాది జాతీయ వినియోగదారుల దినోత్సవాన్ని 'డిజిటల్ న్యాయం ద్వారా సమర్థవంతమైన, వేగవంతమైన పరిష్కారం' అనే ఇతివృత్తంతో నిర్వహించుకుంటున్నామని చెప్పారు. డిజిటల్ న్యాయ వ్యవస్థ ద్వారా సమయం ఆదా కావడమేగాక వేగవంతంగా న్యాయం అందుబాటులోకి వస్తుందని పేర్కొన్నారు. ఆన్‌లైన్ లావాదేవీల్లో జరుగుతున్న మోసాల పట్ల వినియోగదారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అనంతరం జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి వై. సుమతి మాట్లాడుతూ తూకాల్లో మోసం జరిగినా, నాణ్యతలేని వస్తువులు విక్రయించినా, రైల్వే విమానయానం, విద్యుత్, గ్యాస్, కొరియర్ సేవలు, ఫుడ్ డెలివరీ, ఆన్‌లైన్ వ్యాపారాల్లో లోపాలు ఎదురైనా సంబంధిత వ్యక్తులు లేదా సంస్థలపై ఫిర్యాదు చేయవచ్చన్నారు. డిజిటల్ న్యాయ వ్యవస్థ ద్వారా వినియోగదారుల కేసులకు సత్వర పరిష్కారం లభిస్తోందని తెలిపారు. ఇందుకోసం జిల్లా స్థాయిలో జిల్లా కమిషన్, రాష్ట్ర స్థాయిలో రాష్ట్ర కమిషన్, జాతీయ స్థాయిలో జాతీయ కమిషన్లు ఏర్పాటు చేసినట్లు వివరించారు. జిల్లా విద్యాశాఖ అధికారి సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ విద్యార్థులు చిన్నతనం నుంచే వినియోగదారుల హక్కులు, కొనుగోలు సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన పెంచుకోవాలని అన్నారు. పాఠశాలల్లో వినియోగదారుల క్లబ్‌ల ద్వారా ఈ అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అనంతరం విద్యార్థులచే వినియోగదారుల ప్రతిజ్ఞ చేయించారు. జాతీయ వినియోగదారుల దినోత్సవ సందర్భంగా జిల్లాస్థాయిలో నిర్వహించిన వ్యాసరచన, వక్తృత్వ పోటీలలో ఆంగ్లం , తెలుగు మీడియం వారీగా ప్రథమ బహుమతికి రూ .5 వేలు, ద్వితీయ బహుమతికి రూ .3 వేలు, తృతీయ బహుమతికి రూ .2 వేలు చొప్పున మొత్తం 40 వేలు, ప్రశంసా పత్రాలు, మెడల్స్ విజేతలకు అందజేశారు. కార్యక్రమంలో డైట్ ఇన్‌ఛార్జ్ ప్రిన్సిపల్ మడితాటి నరసింహారెడ్డి, జిల్లా పబ్లిక్ హెల్త్ నర్సింగ్ అధికారి శోభారాణి, జిల్లా తూనికలు-కొలతల ఇన్‌స్పెక్టర్ దివ్య, జిల్లా ఫుడ్ సేఫ్టీ అధికారి షేమంతాహా, రాయచోటి జీఎస్‌టీ అసిస్టెంట్ కమిషనర్ షేక్ సుమయ, మదనపల్లె జీఎస్‌టీ అసిస్టెంట్ కమిషనర్ విరంజీవి, జిల్లా మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ అనిల్ కుమార్, సీనియర్ అసిస్టెంట్ వాజాజీ, ఉపాధ్యాయులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

కెరీర్ గైడెన్స్‌పై అవగాహన

సుండుపల్లె : స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కెరీర్ గైడెన్స్ వృత్తి ఎంపిక ప్రదర్శనలో భాగంగా మండలంలోని ఉన్నత పాఠశాలల నుంచి విద్యార్థిని విద్యార్థులు తమ భవిష్యత్తు ఎలా ఉండాలి అనే లక్ష్యంతో ఉత్తమ నైపుణ్యాలైన డాక్టర్, ఇంజినీర్, రైతు , పైలట్, చెఫ్, పోలీస్ వంటి వృత్తి నైపుణ్యాలను ప్రదర్శించారు. ఈ ప్రదర్శనలు ఆరు ప్రధాన కేటగిరీల లో నిర్వహించారు అనంతరం వివిధ పాఠశాలల విద్యార్థులు ఎగ్జిబిట్ ప్రదర్శనలు చేపట్టారు. డ్రాయింగ్ కాంపిటీషన్‌లో విద్యార్థులు తమ నైపుణ్యాలను చాటారు. సంబంధిత కేటగిరీలలో జిల్లాస్థాయికి ఎంపిక చేస్తారని పేర్కొన్నారు. ఎంఈఓ బి.వెంకటేష్ నాయక్, రవీంద్ర నాయక్, ఇన్‌ఛార్జ్ ప్రధానోపాధ్యాయులు డి.నాగార్జున, ట్రైబల్ స్కూల్ ప్రిన్సిపల్ వెంకటేశ్వర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎన్‌హెచ్ పరిహారం కోసం ఎదురుచూపులు

ప్రజాశక్తి - వేంపల్లె

చాగలమర్రి-రాయచోటి రోడ్డుకు సంబంధించిన నేషనల్ హైవే రోడ్డు మార్గంలో భూములు, స్థలాలు కోల్పయిన బాధితులు నష్టపరిహారం కోసం ఎదురుచూస్తున్నారు. చాగలమర్రి-రాయచోటి వరకు కేంద్ర ప్రభుత్వం ఎన్‌హెచ్ రోడ్డును మంజూరు చేసింది. ఆ రోడ్డు వేసేందుకు ఏడాది కిందట అధికారులు సర్వే చేసి వేంపల్లె గ్రామానికి చెందిన పలువురు వ్యక్తులు, రైతుల భూములు, ఇంటి స్థలాల డ్యాకుమెంట్లును, బ్యాంకు ఆకౌంట్లను ఎన్‌హెచ్ అధికారులు, రెవెన్యూ అధికారులు తీసుకున్నారు. అయితే ఇటీవల అధికారులు భూములు కోల్పోయిన రైతులకు మాత్రమే మొదటి ఫేస్ కింద పరిహారం రైతుల ఖాతాలో వేశారు. స్థలాలు కోల్పయిన బాధితులకు ఇంతరకు పరిహారం ఇవ్వలేదు. పరిహారం అందక, స్థలాలను అమ్ముకోలేక యాజమానులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వేంపల్లె పంచాయతీ పరిధిలో చాగలమర్రి-రాయచోటికి సంబంధించిన ఎన్‌హెచ్ రోడ్డులో దాదాపు 42.69 ఎకరాల భూమి రోడ్డులోకి వెళుతోంది. దాదాపు 120 మంది బాధితులున్నారు. వీరిలో ఇంటి స్థలాలకు చెందిన బాధితులకు మాత్రం అధికారులు పరిహారం ఇవ్వలేదు. పరిహారం కోసం రెవెన్యూ కార్యాలయం చూట్టు తిరుగుతున్నామని బాధితులు వాపోతున్నారు. ఎన్‌హెచ్ అధికారులే పరిహారం మంజూరు చేయాల్సి ఉందని, తమకు సంబంధంలేదని రెవెన్యూ అధికారులు అంటున్నట్లు బాధితులు పేర్కొంటున్నారు. అవసరాల కోసం ఇతరుల వద్ద వడ్డీలకు డబ్బులు తెచ్చుకుంటున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రోడ్డుకు తీసుకున్న వాటికైనా పరిహారం త్వరగా ఇస్తే వడ్డీలకు తెచ్చిన చోట అప్పు తీర్చేందుకు వీలు ఉంటుందని తెలిపారు. కాలయాపన చేయడంతో వడ్డీలు పెరిగిపోతున్నట్లు బాధితులు వాపోతున్నారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు ఎన్‌హెచ్ రోడ్డులో ఇంటి స్థలాలు కోల్పయిన బాధితులకు పరిహారం మంజూరు చేయాలని బాధితులు కోరుతున్నారు.

పరిహారం ఇచ్చి ఆదుకోవాలి

చాగలమర్రి-రాయచోటి వెళ్లే ఎన్‌హెచ్ రోడ్డులో ఉన్న ఇంటి స్థలం రోడ్డుకు పోతోంది. సర్వే చేయడంతోపాటు పత్రాలు తీసుకొని ఏడాది కావస్తోంది. ఇంతవరకూ పరిహారం ఇవ్వలేదు. ఎదురు చూడాల్సి వస్తోంది. రోడ్డు వస్తున్నందున ఇంటి స్థలం కూడా అమ్ముకోలేక పోతున్నాను. అధికారులు స్పందించి ఇంటి స్థలం బాధితులకు వెంటనే పరిహారం మంజూరు చేయాలి.

- చెన్నకేశవ, ఇంటి స్థల యాజమాని

అధికారుల చూట్టూ తిరిగినా ఫలితం లేదు

జాతీయ రోడ్డు నిర్మాణంతో పాపాఘ్ని నది సమీపంలో ఉన్న ఇంటి స్థలం కోల్పోతున్నాను. నష్ట పరిహారం ఇస్తామని తన ఇంటి స్థలాన్ని రోడ్డు నిర్మాణానికి అధికారులు తీసుకున్నారు. ఏడాది కావస్తున్నా పరిహారం అందలేదు. భూములు కోల్పోయిన రైతులకు మాత్రం ఇచ్చారు. ఇలా చేయడం సరికాదు. ఇంటి స్థలాల బాధితులపై కనికరం చూపించి వెంటనే పరిహారం విడుదల చేయాలి.

- కాటమయ్య, స్థల యాజమాని

ఘనంగా ముందస్తు క్రిస్మస్ వేడుకలు

మినీ క్రిస్మస్ వేడుకల్లో విజయమ్మ

ప్రజాశక్తి - వేంపల్లె

మినీ ముందస్తు క్రిస్మస్ వేడుకల్లో మాజీ సిఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. మండలంలోని ఇడుపులపాయి వ్యవసాయ క్షేత్రంలో ఉన్న నెమళ్ల పార్కు సమీపంలో ఉన్న ఓపెన్ చర్చిలో ముందస్తు క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. ప్రతి ఏడాది ఇడుపులపాయిలోని నెమళ్ల పార్కు సమీపంలో ఉన్న చర్చిలో వైఎస్ఆర్ కుటుంబ సభ్యులు, బంధువులు కలిసి ముందస్తు క్రిస్మస్ వేడుకలను జరుపుకోవడం ఆనావాయితీ. వైఎస్ సతీమణి విజయమ్మ, జగన్‌రెడ్డి సతీమణి భారతి, కుమార్తెలు, వైసిపి జిల్లా అధ్యక్షుడు రవీంద్రనాథ్‌రెడ్డి, మాజీ ఆర్టీసీ చైర్మన్ మల్లికార్జునరెడ్డి, పలువురు వైఎస్ కుటుంబ సభ్యులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. క్రిస్మస్ కేక్ కట్ చేశారు. ఇడుపులపాయి వైఎస్ఆర్ సమాధికి విజయమ్మ నివాళులర్పించారు. ముందస్తు క్రిస్మస్ వేడుకల్లో అరకు ఎంపీ తనూజా రాణి, రాజంపేట ఎమ్మెల్యే అకేపాటి అమర్నాథ్‌రెడ్డి, ఎంపీ సతీమణి సమతమ్మ, జగన్ మేనత్త విమలమ్మ, వైసీపీ వేంపల్లె మండల కన్వీనర్ చంద్రఓబుల్ రెడ్డి, మైనార్టీ నాయకులు షేక్షావలి, మునీరు, మటన్ బాబా, పోతిరెడ్డి శంకరయ్య, తూపల్లె వెంకట నారాయణరెడ్డి పాల్గొన్నారు.

నాగార్జున మోడల్ స్కూల్‌లో..

కడప అర్బన్ : నగరంలోని నాగార్జున మోడల్ స్కూల్లో బుధవారం ముందస్తు క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. విద్యాసంస్థల చైర్మన్ ఎం.శివ శంకర్ రెడ్డి, డైరెక్టర్ శ్రీదేవి క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. వివిధ రకాల నక్షత్రాలు, రంగురంగుల బెలూన్లు, క్రిస్మస్ ట్రీ, క్రీస్తు జన్మించిన పాకఅలంకరించి వేదిక ఏర్పాటు చేశారు. క్రీస్తు జన్మ వృత్తాంతం నాటక రూపంలో విద్యార్థులు ప్రదర్శించారు. ప్రైమరీ చిన్నారులు క్రిస్మస్ ట్రీ అలంకారంలో ఉన్న దుస్తులను, క్రైస్తవ సాంప్రదాయ దుస్తులను ధరించి గీతాలను, ముత్యాలను ప్రదర్శించారు. అనంతరం శాంటా క్లాజ్ వేషధారణలో చిన్నారులు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. పెద్దలపట్ల గౌరవభావంతో మెలగాలని, దానగుణం అలవర్చుకోవాలని దాన గుణం అలవర్చుకోవాలని విద్యాసంస్థల చైర్మన్ ఎం.శివ శంకర్ రెడ్డి, డైరెక్టర్ శ్రీదేవి పేర్కొన్నారు. కార్యక్రమంలో విద్యార్థులు, బోధన, బోదవేతర సిబ్బంది పాల్గొన్నారు.

సాయిబాబా స్కూల్లో..

అక్కాయపల్లెలోని సాయిబాబా పాఠశాలలో బుధవారం ముందస్తు క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఎమ్మెల్సీ ఎం.వి. రామచంద్రారెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రిస్మస్ ప్రపంచ వ్యాప్తంగా ఆనందంగా నిర్వహించుకుంటారని తెలిపారు. ఏసుక్రీస్తు ప్రపంచానికి ప్రేమ, కరుణ, శాంతి, సత్యం అనే విలువలను తెలిపారని చెప్పారు. క్రిస్మస్ పండుగ అంటే ప్రేమ పంచడం మన చుట్టూ ఉన్న పేదవారికి సహాయం చేయడం బాధలో ఉన్న వారి ఓదార్చడం పండుగ గొప్పదనం అని పేర్కొన్నారు. విద్యా సంస్థల సీఈవో ఎంవి శ్రీదేవి మాట్లాడుతూ పండుగ రోజు మంచి నిర్ణయం తీసుకొని అందరికీ ఉపయోగపడేలా చూడాలని తెలిపారు. కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు సుబ్బరాయుడు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు. సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి.

భాష్యం స్కూల్లో సెమీ క్రిస్మస్ వేడుకలు

ఐటిఐ సర్కిల్ వద్ద ఉన్న భాష్యం స్కూల్లో సెమీ క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. స్కూల్ ప్రిన్సిపల్ విశ్వనాథ్ మాట్లాడుతూ ఏసు క్రీస్తు జన్మదినాన్ని పురస్కరించుకొని ఈనెల 25న క్రిస్మస్ వేడుకలు నిర్వహిస్తారని పేర్కొన్నారు. క్రిస్మస్ తాత వేషధారణలో ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో జోనల్ ఇన్చార్జి ఉమాదేవి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వేములలో..

వేల్పుల, బెస్తవారిపల్లె మహిళలకు చీరలు పంపిణీ

వేముల : స్థానిక క్రిస్మస్ పండుగను పుర స్కరించుకుని వేల్పుల, బెస్తవారిపల్లె గ్రామ మహి ళలకు వైసిపి వేముల మండల పరిశీలకులు వేల్పుల రాము తల్లి లింగాల పార్వతమ్మ ఆధ్వ ర్యంలో వందమంది మహిళలకు చీరలు పంపిణీ చేశారు.

బీరం పాఠశాలలో..

ఖాజీపేట : మండలంలోని కొత్త నెల్లూరు సమీపం వద్ద ఉన్న బీరం శ్రీధర్ రెడ్డి పాఠశాలలో బుధవారం సెమీ క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. పాఠశాల కరస్పాండెంట్ బీరం సుబ్బారెడ్డి, చైర్ పర్సన్ సరస్వతమ్మ, డైరెక్టర్ స్వాతి శ్రీకాంత్, ప్రిన్సిపల్ శ్వేత పాల్గొన్నారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బాధితులకు సిఎం సహాయనిధి చెక్కులు పంపిణీ

ప్రజాశక్తి-పుల్లంపేట

ఓబులవారిపల్లె మండలంలో ఎమ్మెల్యే అరవ శ్రీధర్, ముక్కా రూపానందరెడ్డి సతీమణి ముక్కా వరలక్ష్మి బాధితులకు బుధవారం వారి ఇళ్లకు స్వయంగా వెళ్లి పంపిణీ చేశారు. ముక్కావారి పల్లి పంచాయతీ పరిధిలోని బాధితులకు చెక్కులు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజలు ఎదుర్కొనే ప్రతి సమస్యకు ప్రభుత్వం అండగా ఉంటుందని చెప్పారు. అవసరంలో ఉన్న అర్హులైన కుటుంబాలకు సిఎం రిలీఫ్ ఫండ్ ద్వారా సహాయం అందేలా నిరంతరం చర్యలు తీసుకుంటున్నామని తెలియజేశారు. ముక్క వరలక్ష్మి మాట్లాడుతూ ఇబ్బంది పడుతూ అప్పులు చేసుకొని హాస్పిటల్‌లో చూపించుకున్న వారికి సిఎం రిలీఫ్ ఫండ్ ద్వారా ఒక భరోసాగా నిలుస్తుందని, అవసరంలో ఉన్న వారికి ప్రభుత్వం సహాయం చేరేలా ముందుంటామని పేర్కొన్నారు.

అంగన్వాడీకి చిన్న సైజు కోడిగుడ్లు సరఫరా

ప్రజాశక్తి - బ్రహ్మంగారిమఠం

బ్రహ్మంగారిమఠం మండలంలో అంగన్వాడీ కేంద్రాలకు సరఫరా చేసే కోడిగుడ్ల పరిమాణం 30 గ్రాములు కూడా లేకపోవడం చాలా బాధాకరమని పలువురు పేర్కొంటున్నారు. గర్భిణులు, చిన్నపిల్లలకు రాష్ట్ర ప్రభుత్వం పౌష్టికాహారం అందించాలనే దృఢసంకల్పంతో రూ.కోట్లాది ఖర్చు చేస్తుంటే అంగన్వాడీ కేంద్రాలకు సరఫరా చేసే ఏజెంట్లు మాత్రం తమ లాభాలతో జేబులు నింపుకునేందుకు తక్కువ సైజు పరిమాణం ఉన్న కోడిగుడ్లను సరఫరా చేస్తున్నారనే ఆరోపణలున్నాయి. పర్యవేక్షించవలసిన అధికారులు మామూలు మత్తులోపడి పట్టీపట్టనట్లు వ్యవహరిస్తున్నారని ఆరోపణలున్నాయి. చాలా చోట్ల వారం వారం రవాణా చేసేందుకు ఇబ్బందిగా ఉంటుందని నెలలకు సరిపడే కోడిగుడ్లు ఒకేసారి అందించి చెడిపోయిన పరిస్థితులు కూడా ఉన్నాయి.

సచివాలయ ఉద్యోగుల మరణాలపై విచారించాలి

నిరసన వ్యక్తం చేస్తున్న సచివాలయం జెఎసి కమిటీ సభ్యులు

ప్రజాశక్తి - జమ్మలమడుగు

గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల అకాల మరణాలపై విచారణ జరపాలని కడప జిల్లా గ్రామ వార్డు సచివాలయ జేఏసీ ఉపాధ్యక్షులు ఎంసి రాజాకులాయి రెడ్డి కోరారు. స్థానిక గాంధీ విగ్రహం వద్ద బుధవారం సచివాలయం ఉద్యోగుల మృతులకు సంతాపం తెలుపుతూ నిరసన వ్యక్తం చేశారు. అనంతరం ఉపాధ్యక్షుడు రాజా కుల్లాయిరెడ్డి మాట్లా డుతూ రాష్ట్రంలో ప్రధాన క్షేత్ర సిబ్బందిగా పనిచేస్తున్న గ్రామ, వార్డు సచి వాలయి సిబ్బంది, వివిధ రకాల సర్వేలు, వివిధ రకాల డిపార్ట్‌మెంట్ అధి కారుల వత్తి డితో సతమతమవుతూ, తీవ్ర అనారోగ్య సమస్యలను ఎదుర్కొవడమే కాక వత్తిడిని తట్టుకోలేక మరణిస్తున్నారన్నారు. గడచిన రెండు నెలల కాల వ్యవధిలోనే 10 మం దికిపైగా ఉద్యోగులు మరణించారంటే పరి స్థితి ఏ స్థాయిలో ఉందో అర్థం చేసు కోవ చ్చన్నారు. ప్రభుత్వం ఈ పరిస్థితిని దృష్టిలో ఉంచుకొని వెంటనే విచారణ కమిషన్‌ను ఏర్పాటు చేయాలన్నారు. నిజా నిజాలు వెలికి తీసి తగు న్యాయం చేయాలని కోరుతున్నామన్నారు. కార్యక్రమంలో కడప జిల్లా గ్రామ వార్డు సచివాలయ కార్యదర్శి వి.పవన్ కుమార్, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

దాడి ఘటనను వివరిస్తున్న మాజీ ఎమ్మెల్యే రఘురామిరెడ్డి

జగన్ దృష్టికి దాడి ఘటన

ప్రజాశక్తి - ఖాజీపేట

మండలంలోని తుడమలదిన్నె దళితవాడకు చెందిన వైసిపి నాయకుడు చాట్ల విజయభాస్కర్‌పై అదే గ్రామానికి చెందిన టిడిపి నాయకులు కులం పేరుతో దూషించి హత్యాయత్నానికి పాల్పడ్డారని మాజీ ఎమ్మెల్యే ఎస్. రఘురామిరెడ్డి, వైసిపి రాష్ట్ర కార్యదర్శి రెడ్యం వెంకటసుబ్బారెడ్డి బుధవారం మాజీ సీఎం జగన్ దృష్టికి తీసుకెళ్లారు. పులివెందులలో వారు జగన్‌ను కలిశారు. దాడి ఘటన విషయాన్ని వివరించారు. బాధితుడికి న్యాయం జరిగేలా చూడాలన్నారు. ఈ విషయమై పోలీసులతో మాట్లాడాలని ఎంపీ అవినాష్‌రెడ్డికి జగన్ సూచించారు. పార్టీ అన్ని విధాలా అండగా ఉంటుందని భరోసా కల్పించారు.

విద్యార్థులను అభినందిస్తున్న డైరెక్టర్ కుమారస్వామి గుప్తా

జాతీయ స్థాయికి ట్రిపుల్‌ఐటి విద్యార్థులు

ప్రజాశక్తి - వేంపల్లె

వికసిత్ భారత్ యంగ్ లీడర్స్ డైలాగ్ పోటీలో ట్రిపుల్‌ఐటి విద్యార్థులు జాతీయస్థాయికి అర్హత సాధించారని డైరెక్టర్ ఏవీఎస్ కుమార్‌స్వామి గుప్తా పేర్కొన్నారు. భారత ప్రభుత్వం వికసిత్ భారత్ 2047 లక్ష్యసాధనలో యువత భాగస్వామ్యం పెంచడం, వారి నాయకత్వ లక్షణాలను ప్రోత్సహించడం కోసం వికసిత్ భారత్ యంగ్ లీడర్స్ డైలాగ్-2026 పోటీలను దేశవ్యాప్తంగా నిర్వహించారన్నారు. ఇందులో ఇడుపులపాయ ఆర్కేవ్యాలీ ట్రిపుల్‌ఐటి క్యాంపస్ నుంచి 14 మంది విద్యార్థులు పాల్గొనగా 10 మంది జాతీయస్థాయికి అర్హత సాధించారన్నారు. ఈ పోటీలో రాష్ట్రవ్యాప్తంగా 45 మంది అర్హత పొందితే, అందులో 10 మంది ఆర్కేవ్యాలీ క్యాంపస్ విద్యార్థులు ఎన్నిక కావడం విశేషమైన విజయం అన్నారు. ఆర్జీయూకేటీ విశ్వవిద్యాలయానికి ఎంతో గర్వకారణమని డైరెక్టర్ తెలిపారు. ఈ పోటీలు 15-29 ఏళ్ల యువత కోసం భారత ప్రభుత్వం నిర్వహించే ఒక ప్రతిష్టాత్మక పోటీ అన్నారు. క్విజ్ ఎస్సే ఛాలెంజ్, ప్రజెంటేషన్ రౌండ్స్ ద్వారా దేశ నిర్మాణంపై వినూత్న ఆలోచనలను ఆహ్వానిస్తుందని తెలిపారు. విజేతలకు జాతీయస్థాయిలో గుర్తింపు మార్గదర్శకత్వం లభిస్తాయని తెలిపారు. విద్యార్థులను అభినందించారు.

జిల్లా టిడిపి ఉపాధ్యక్షులుగా మల్లికార్జునరెడ్డి

ప్రజాశక్తి - బ్రహ్మంగారిమఠం

బ్రహ్మంగారిమఠం మండలానికి చెందిన టిడిపి నాయకుడు కానాల మల్లికార్జునరెడ్డి జిల్లా టిడిపి ఉపాధ్యక్షులుగా నియమితులయ్యారు. మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ ఆశీస్సులతో నియమితులయ్యారు. మల్లికార్జునరెడ్డి నియామకంపై తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మల్లికార్జునరెడ్డి మాట్లాడుతూ తనపై నమ్మకంతో కడప జిల్లా ఉపాధ్యక్షుడు పదవి ఇచ్చినందుకు తగు న్యాయం చేస్తానని తెలిపారు. తెలుగుదేశం పార్టీ బలోపేతానికి తనవంతు కృషి చేస్తానని తెలిపారు.

ఇస్రో బాహుబలి విజయవంతం దేశానికి గర్వకారణం

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

అంతరిక్ష పరిశోధన సంస్థ బాహుబలి విజయవంతం దేశానికి గర్వకారణమని శాస్త్ర ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో) ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన బాహుబలి రాకెట్ విజయవంతంగా పూర్తయి 'బ్లూ బర్డ్ బ్లాక్-2' ఉపగ్రహాన్ని నిర్దిష్ట కక్ష్యలోకి ప్రవేశపెట్టడం భారతదేశం అంతరిక్ష సాంకేతికతలో తన విశ్వసనీయతను మరోసారి ప్రపంచానికి చాటిందన్నారు. అత్యంత క్లిష్టమైన ఈ ప్రయోగాన్ని ఇస్రో శాస్త్రవేత్తలు సమర్థవంతంగా పూర్తి చేయడం దేశ యువతకు స్ఫూర్తిదాయకమన్నారు. భవిష్యత్తులో మరిన్ని కీలక అంతరిక్ష ప్రయోగాలకు దోహదపడుతుందని తెలిపారు. ఈ విజయం భారతదేశాన్ని అంతర్జాతీయ అంతరిక్ష రంగంలో మరింత ముందుకు నడిపిస్తుందన్నారు. ఇస్రో చైర్మన్, శాస్త్రవేత్తలు, ఇంజినీర్లు, సాంకేతిక సిబ్బంది అందరికీ ఆయన హృదయపూర్వక అభినందనలు తెలిపారు.

రహదారుల పనులను వేగవంతం చేయండి

ప్రజాశక్తి- రాయచోటి

రహదారుల పనులు వేగవంతంగా, ప్రజలకు ప్రయాణ ఖర్చు తగ్గేలా పూర్తి చేయాలని కలెక్టర్ నిశాంత్ కుమార్ అధికారులను ఆదేశించారు. బుధవారం ఉదయం రాయచోటి కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్లో పంచాయతీరాజ్, రహదారులు, భవనాల శాఖ, గ్రామీణ నీటి సరఫరా శాఖ, నీటిపారుదల శాఖ, జాతీయ రహదారులు, డ్వామా తదితర ఇంజనీరింగ్ శాఖల పనుల పురోగతిపై జిల్లా, డివిజనల్ స్థాయి అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ శాఖ ఆధ్వర్యంలో ప్రధానమంత్రి గ్రామ సడక్ యోజన, నాబార్డ్, తదితర నిధులతో చేపడుతున్న రహదారుల పనులను వేగవంతం చేయాలని పేర్కొన్నారు. గ్రామీణ రహదారులను మండల రహదారులకు, మండల రహదారులను డివిజన్ స్థాయి రహదారులకు, డివిజన్ స్థాయి రహదారులను జిల్లా స్థాయి రహదారులకు కలిపే విధంగా పనులు చేపట్టాలని సూచించారు. రహదారుల పనులు పూర్తి చేసేటప్పుడు ప్రజలకు ప్రయాణ ఖర్చు తగ్గేలా చూసుకోవాలని సూచించారు. పల్లె పండుగ కార్యక్రమాలలో జరిగే పనులను వేగవంతం చేయాలన్నారు.

IN THE COURT OF THE HON'BLE JUNIOR CIVIL JUDGE, KAMALAPURAM

O.S.No. 212/2025

Andhra Pragathi Grameena Bank, Represented by its Branch Manager, Kamalapuram 'X' Road Branch, Kamalapuram, Kadapa District, (Formerly known as Andhra Pragathi Grameena Bank). **...Plaintiff**

Vs

1) Sunkesula Sreenivasulu, S/o. S. Subbanna, Hindu, aged about 32 years, Agriculturist & Business, residing at D.No.3/11, Chadipiralla Village, Kamalapuram Mandal, Kadapa District.
2) Madduru Rayappa, S/o. Late M. Subbanna, Hindu, aged about 55 years, Agriculture & Business, residing at G. Appayapalli Village, C. Rajupalem Post, Kamalapuram Mandal, Kadapa District. **...Defendants**

NOTICE TO DEFENDANT No.1

Please take notice that the Hon'ble Court has ordered for notice to the defendant No.1 to appear on 30-12-2025 at 10:30 A.M. in the above Court, failure to appear by you the matter will be decided exparte.

//By Order of the Hon'ble Court//
B. SYAM SUNDER
Advocate for Plaintiff, KADAPA.

In The Court of the Principal Motor Accident Claims Tribunal : Nellore

M.V.O.P.No. 364 / 2025

రొక్కారోకల యాదగిరి
బుచ్చిరెడ్డిపాళెం - పిటిషనరు

Vs

కె.చైతన్య, తండ్రి వెంకట సుబ్బయ్య, (డ్రైవర్),
అడ్రసు : 7-63/ఎ, నందిమండలం గ్రామం,
పెండ్లిమర్రి మండలం, వైఎస్ఆర్ కడప. - రెస్పాండెంటు

నోటీసు

ఇందుమూలముగా తెలియజేయడమేమనగా రెస్పాండెంటుకు నోటీసు నిమిత్తమై పై నెంబరు కేసు **తే09-01-2025ది** వాయిదా వేసియున్నది. రెస్పాండెంటు నకు గాని వకీలు ద్వారా గానీ ఖాదన ఆ రోజు ఉదయం **10.30** గంటలకు మీరు స్వయంగా గానీ లేదా వకీలు ద్వారా గానీ పై తెలిపిన కోర్టులోహాజరై ఆక్షేపణలు తెలుపుకోవలసినది. లేని యెడల కేసు మీ పరోక్షమున తీర్మానించబడును.

ఎన్.రూపకుమార్
అడ్వకేట్, నెల్లూరు. సెల్: **9885161350**